# మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

పీలేరు, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ పి.టి.ఎం. శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే మదనపల్లెను జిల్లాగా ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. అయితే 16 నెలలు పూర్తవుతున్నా మదనపల్లెను జిల్లాగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. నియోజకవర్గం నుంచి ఈ నెల 26న ఛలో మదనపల్లె కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు చంద్రయ్య, ధరణికుమార్, సుధాకర్బాబు, చంద్రయ్య, మహమ్మద్ షరీఫ్. టి.ఎల్. వెంకటేష్, శ్రీకాంత్, నరేష్, భానుప్రకాష్, గట్టప్ప, మోహన్, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 06 అక్టోబర్ 2025


# కబ్జా భూమికి కంచెను నాటిన రెవెన్యూ సిబ్బంది

బద్వేలు, అక్టోబర్ 5, ప్రభాత వార్త

బద్వేల్ మండలం వీరబల్లి గ్రామంలో రాత్రికి రాత్రి జెసిబి సాయంతో కొంత మంది కబ్జాదారులు భూమిని చదును చేసి ఫెన్సింగ్ కొరకు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇది తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఆదివారం కంచె కోసం ఏర్పాటు చేసిన స్తంభాలను కూల్చి వేశారు. సదరు భూమిలో "హెచ్చరిక బోర్డును నాటి స్తంభాలను తొలగించడంతో పాటు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని సూచించారు. కొంతమంది శని, ఆదివారాలలో ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడుతున్నారని రెవెన్యూ సిబ్బంది ప్రతి ప్రభుత్వ భూమిపై నిఘా ఉంచడం జరిగిందని కావున ఆబ్జాదారులు జాగ్రత్తగా ఉండాలని లేకపోతే చర్యలు తప్పవని సూచించారు.



## మైలవరం ప్రాజెక్టు గేట్ల రక్షణ పనులకు

# 3.19 కోట్లు నిధులు

### పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ

రాజంపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త

ఉమ్మడి కడప జిల్లాలోని మైలవరం ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు, రక్షణ పనులకు 3.19 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మైలవరం ప్రాజెక్టుకు ఈ నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం పరిపాలనపరమైన ఉత్తర్వులుకూడా జారీ చేసింది. 1982లో పూర్తయిన ఈ ప్రాజెక్టుకు 2021 భారీగా వరద నీరు రావడంతో గేట్లు, ఇతర కీలకమైన వనరులకు నష్టం వాటిల్లింది. అప్పటి అధికారులు ప్రభుత్వానికి మరమ్మతులు చేపట్టాలని నివేదిక పంపినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ పనులు చేపట్టకపోతే భవిష్యత్తులో ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చినట్లయితే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించడంతో ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు నిధులను మంజూరు చేసింది. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని జల వనరుల శాఖ భావిస్తోంది. ఈ విషయాన్ని మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి పార్థసారథి ప్రకటించడం జరిగింది.



మైలవరం ప్రాజెక్టు గేట్లు

# నకిలీ మద్యం డంపును గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు

### కల్తీ మద్యం కేసులో నిందితుడు దాసిమ్మ తోటలో డంప్ సీజ్

మదనపల్లెక్రైమ్, అక్టోబర్ 5 (ప్రభాతవార్త).

అన్నమయ్య జిల్లాలో కలకలం సృష్టించిన ములకలచెరువు కల్తీ మద్యం కేసు దర్యాప్తులో ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన కట్టా సురేంద్ర నాయుడుకు చెందిన పీటీఎం (పెద్దతిప్పసముద్రం) మండలంలోని దాసిమ్మ తోటలో దాచి ఉంచిన భారీ కల్తీ మద్యం డంప్‌ను ఆదివారం ఎక్సైజ్ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందు తన సిబ్బందితో కలిసి వెళ్లి, నిందితుడు తోటలో రహస్యంగా దాచిన కల్తీ మద్యం నిల్వలను సీజ్ చేశారు. కట్టా సురేంద్ర నాయుడు పీటీఎంలో శ్రీఆంధ్ర వైన్స్ షాపు పేరుతో లైసెన్స్ మద్యం షాపును నిర్వహిస్తున్నాడు. ఈ కల్తీ మద్యం దందా వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, ఎక్సైజ్ పోలీసులు నిందితుడు నడుపుతున్న శ్రీఆంధ్ర వైన్స్ షాపును కూడా సీజ్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే రూ. 1.75 కోట్ల విలువైన కల్తీ మద్యం, స్పిరిట్, బాటిళ్లు, యంత్ర సామాగ్రిని స్వాధీనం చేసుకుని, ప్రధాన సూత్రధారులతో సహా 10 మందికి పైగా నిందితులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ కల్తీ మద్యం తయారీ, విక్రయ దందాకు సంబంధించిన పూర్తి వివరాలపై ఎక్సైజ్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



# ఈతకు వెళ్లి ఇరువురు విద్యార్థులు

### అక్కచెల్లెల్లా కుటుంబాలలో విషాదఛాయాలు

సంబేపల్లి అక్టోబర్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ నడిమి రాజు గారి పల్లె సమీపంలోనీ చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాస్తూ ఇరువూరు విద్యార్థులు మోక్షిత్ నాయుడు( 13) ముల్లగూర అంకిత నాయుడు(11) మృతి చందారు ఆదివారం నడిమి రాజుగారి పల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు సంబేపల్లి మండలం రెడ్డివారి పల్లి పంచాయతీలోని నడింరాజుగారి పల్లి సమీపంలోని నల్ల రాళ్ల ఒడ్డుకుంటలో పడి మృతి చెందినట్లు తెలిపారు. నడిం రాజు గారి పల్లి కి చెందిన జనార్ధన్ నాయుడు ఇంటికి మదనపల్లికి చెందిన మోక్షిత్ నాయుడు దసరా సెలవులు రావడంతో నడుం రాజు గారి పల్లి వచ్చాడు ఇరువురు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు వారు తెలిపారు అంకిత నాయుడు తిరుపతిలో ఆరవ తరగతి చదువుతున్నట్లు తెలిపారు పైడి మోక్షిత్ నా యుడు మదనపల్లిలోని భాష్యం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. మృతి చెందిన ఇరు వురు అక్కచెల్లెళ్ల పిల్లలని దసరా సెలవుల కోసం వచ్చి మృతి చెందినట్లు బంధువులు బోరున విలపించారు మోక్షిత్ నాయుడు కి ఇరువురు అక్క చెల్లెలు ఉన్నట్లు తెలిపారు .మృతదేహాలను కుంటలో నుండి బయ టకు తీయగా మోక్షిత్ ప్రాణాలతో ఉన్నట్లు గమనించి ద్విచక్ర వాహనంలో రాయచోటికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్నరూరల్ సీఐ వరప్రసాద్ ఏఎస్ఐ బాదుల్లా హు టాహుటిన సంఘటన స్థలానికి వెళ్లే వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను వారి కుటుం బీకులను అడిగి తెలుసుకున్నారు.



# ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 5, ప్రభతవార్త :

ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ మరియు రోటరీ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ కంటి ఆసుపత్రి సభా భవనము నందు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ శ్యామ్ సుందర్ రెడ్డి ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి శీను రోటరీ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ సాధుగోపాలకృష్ణ రోటరీ కంటి ఆసుపత్రి అధ్యక్షులు కోటా శివకుమార్ లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని భావి సమాజ నిర్మాతలను తరగతిగది నాలుగు గోడల మధ్య తయారు చేసే గొప్ప సేవ అని అటువంటి ఉపాధ్యాయులుగా సమాజ హితులుగా విశిష్ట సేవలు అందించిన తుమ్మల ఈశ్వర్ రెడ్డి, దొంతు మురళీకృష్ణ,ఎల్ చంద్ర ఓబుల రెడ్డి,రోటరీ క్లబ్ రోటరీ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేసి గౌరవించడం సత్సంప్రదాయంగా భావిస్తున్నామని అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ నందు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని రొటీరియన్స్ అందరినీ అభినందించారు.క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి సెక్రటరీ షేక్ బాబా, ట్రెజరర్ దొంతు బాలాజీలు మాట్లాడుతూ సద్గురువులను సగౌరవంగా సత్కరించడము చాలా ఆనందదాయకం సంతోషదాయకం గురుకులానికి అందరకు స్ఫూర్తిదాయకమని తెలియజేశారు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు తుమ్మల ఈశ్వర్ రెడ్డి దొంతు మురళీకృష్ణ ఎల్ చంద్ర ఓబులరెడ్డి లు మాట్లాడుతూ విద్యారంగానికి సంబంధించిన అధికారులు ప్రభుత్వాల చేత పొందే అవార్డుల కంటే అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ ద్వారా ఈ పురస్కారాలను స్వీకరించడం మేము మరువలేమని మా బాధ్యతను మరింత పెంచారని ఈ సన్మానము గురువులందరికి జరిగిన సన్మానంగా భావిస్తున్నామని సమాజానికి మరిన్ని సేవలు అందించేందుకు మాలో స్ఫూర్తిని నింపారని తెలియజేశారు మాస్టర్ ఆఫ్ శర్మని బేపారి జాకీర్ అహ్మద్ దొంతు బాలాజీలు అసిస్టెంట్ గవర్నర్ కే మల్లికార్జున పాస్ట్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్ డాక్టర్ రాజా రామ్మోహన్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ ఖాదర్బాషా మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఉట్టి తిరుపతయ్య ఎస్టియు ఏపీటీఎఫ్ సంఘాలనాయకులు ఉపాధ్యాయిని జీవీజీ ఉపాధ్యాయులు పురస్కార గ్రహీతల కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మందలించిందన్న కోపంతోనే

# తల్లిని చంపిన కొడుకు

ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 5, ప్రభాతవార్త:

కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం చోటు చేసుకుంది. తల్లి మందలించిందని కుమారుడు ఆమె గొంతు కోసి హతమార్చాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో జరిగింది. వంట చేస్తుండగా తల్లి లక్ష్మీదేవితో కుమారుడు యశ్వంత్‌రెడ్డి గొడవపడ్డాఉ. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురై కత్తితో ఆమె గొంతు కోశాడు. హత్య సమయంలో తండ్రిని గదిలో యశ్వంత్ బంధించాడు. మృతురాలు లక్ష్మీదేవి ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. నిందితుడు యశ్వంత్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యశ్వంత్‌రెడ్డికి కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో తనను తల్లి తిట్టిందని కూరగాయల కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. విచక్షణారహితంగా కత్తితో పొడిచి రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని జుట్టు పట్టుకొని బయటకు ఈడ్చుకుంటూ తెచ్చి పడేశాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. విషయం తెలిసిన ఆమె భర్త కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ ఘటనపై విజయ భాస్కర్ పోలీసులకు సమాచారం అందజేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు నిందితుడు యశ్వంత్‌రెడ్డిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.



# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దువ్వూరు, అక్టోబర్ 05, ప్రభాతవార్త:

మండల పరిధిలోని వాహనదారులు తమ వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఎస్ఐ వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వివిధ రహదారులలో వాహణాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి ఉంటారని వారిని మద్యం సేవించే పరికరంతో పరిశీలించారు. అలాగే సక్రమంగా రికార్డులు లేని వారికి జరిమానాలు విధించారు. దువ్వూరు బైపాస్, మురళి నగర్ వద్ద ఈ తనిఖీలు చేపట్టారు.

# వెల్లాల దేవస్థానం అభివృద్ధికి విరాళం

రాజుపాలెం, అక్టోబర్ 05, ప్రభాతవార్త:

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో గల మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సంజీవరాయ స్వామి దేవస్థానంలో అభివృద్ధికి భక్తులు విరాళాలను ఆదివారం అందించారు. కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన చలివేంద్రం సంజీవ రాయుడు ఆయన భార్య శారదాలు ఒక లక్ష వెయ్యి రూపాయలు విరాళం అందించారు. ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన కీర్తిశేషులు అమరావతి బాలాంజనేయులు జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీదేవమ్మ 20 వేల రూపాయలను విరాళంగా అందించారు. ఈ నిధులను ఆలయ కమిటీ మరియు దేవాదాయ శాఖ అధికారులు సిజిఎఫ్ ఫండ్ కు జమ చేసినట్టు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ వేదపండితులు పాల్గొన్నారు.



# వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం/ పిలేరు అక్టోబర్ 4 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మొదటిరోజు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, అర్చన నిర్వహించారు. ఉదయం 7 గంటలకు యాగశాల పూజ చతుష్టార్చన, హోమం, పవిత్రప్రతిష్ఠ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుండి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్టోబరు 6న ఉదయం పవిత్రసమర్పణ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, అక్టోబరు 7న ఉదయం యాగశాల పూజ, మహాపూర్ణాహుతి, స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి తిరువీధి ఉత్సవం, పవిత్ర వితరణతో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి గృహస్తులు(ఇద్దరు) రూ.300/ చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక పవిత్రం, స్వామివారి తీర్థ ప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కృష్ణమూర్తి, నాగరాజు ఆలయ అర్చకులు శ్రీ కృష్ణ ప్రసాద్ బట్టర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పవిత్రోత్సవాలను తీసుకొస్తున్న వేద పండితులు

# శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయం

# భోజనశాల షెడ్డు స్థలం కోసం రూ.6లక్షలు విరాళం

### కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసిన ఆలయ కమిటీ సభ్యులు

బద్వేల్ అర్బన్ అక్టోబర్ 05 ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్ త్యాగరాజు కాలనీలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయం ఆవరణంలో దేవాలయం కు ఆగ్నేయంగా ఉండే స్థలం అన్నప్రసాదం కోసం స్థలానికి 6,00,000/ రూపాయల విరాళాన్ని త్రిబుల్ ఆర్,వి,యం గ్రూప్ ఆఫ్ కంపెనీ యం.డి రామనబోయిన మురళి సతీమణి సునీత కుటుంబ సభ్యులు రామనబోయిన పుల్లయ్య సతీమణి కృష్ణమ్మ తల్లిదండ్రుల పేరుతో 6,లక్షల రూపాయలు విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు చేతికి అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ వి,యం, కంపెనీ యం.డి రామన బోయిన మురళి యాదవ్ బద్వేల్ ప్రాంతంలో అనేక సంవత్సరాలుగా నెల్లూరు రోడ్డులో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రతినెల శ్రవణా నక్షత్రం స్వామివారికి అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం మరియు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా శ్రీ కాశీ విశ్వేశ్వర శివాలయం స్పటిక లింగం ఆలయ నిర్మాణానికి వారు ఎంతగానో కృషి చేస్తూ స్పటిక లింగం శివాలయం ఆవరణంలో ప్రతి సోమవారం స్వామివారిని దర్శించుకునే భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు, అవసరమైన అన్నదానం భోజనశాల షెడ్డు కు స్థలానికి ఆరులక్షల రూపాయలు విరాళం వారి కుటుంబ సభ్యులు చేతుల మీదుగా అందజేయడం ఎంతో సంతోషకరమన్నారు, వారికి వారి కుటుంబ సభ్యులకు కాశి విశ్వేశ్వర స్వామి శివుని అనుగ్రహం ఉండాలని వారి వ్యాపారం దినదిన వృద్ధి చెందాలని ఆలయ గౌరవ అధ్యక్షులువంకెల పెద్ద పోలీరెడ్డి,ఆలయ వైస్ చైర్మన్ పోకల రమణారెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు గాజుల నరసింహులు ( బాబు )పామూరు వెంకటేశ్వర్లు, తుపాకుల సాయి తరుణ్ గొడ్లవిటి బాల సుబ్రహ్మణ్యం, లాటూరి నాగరాజు సింగ్, ఆవులేటి వెంకటసుబ్బయ్య, బసివి అదేయ్య, ఆవుల వెంకట రమణ, మరియు కమిటీ సభ్యులు మురళి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోవు రోజుల్లో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో వారి కుటుంబ సభ్యులు చేపట్టాలని అలాగే మరికొందరు కూడా ఆలయానికి వారు వంతు సహాయ సహకారాలు అందజేయాలని పలువురు కోరారు



# జిల్లాలో ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, అక్టోబరు 5, ప్రభాతవార్త:

జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

**వాహనాలు తనిఖీలు :** అనుమానాస్పద వాహనాలను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు.

**సైబర్ నేరాలపై అవగాహన :** ప్రజలు సైబర్ నేరాల భారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచించారు.

**రహదారి భద్రత నిబంధనలు :** రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

**నియమ ఉల్లంఘనలపై కఠిన చర్యలు :** సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు, ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



# వ్యాయామాల ద్వారా ఆరోగ్యం పదిళం

### - ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య

కడప క్రైం, అక్టోబరు 5, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఫిట్ ఇండియా సండేస్ ఆన్‌సైకిల్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటు చేసుకొని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యాయామాల ద్వారా ఆరోగ్యం పదిళమని ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌లో పాల్గొనే విధంగా చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని అది వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే అన్నారు. సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలగదన్నారు. వ్యాయామాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సైకిల్ ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి, మహవీర్, అంబేద్కర్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి మీదుగా తిరిగి జిల్లా పోలీసు కార్యాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీతో పాటు ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు శివరాముడు, టైటస్, శ్రీశైలరెడ్డి, కడప టు టౌన్ సీఐ గంటా సుబ్బారావు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ట్రాఫిక్ సీఐ జావీద్, పెండ్లిమర్రి ఎస్సై మధుసూదన్‌రెడ్డి, కడప వన్‌టౌన్ ఎస్సై ప్రతాప్‌రెడ్డి, ఆర్ ఎస్సైలు వెంకటేశ్వర్లు, స్వామి నాయక్, రామస్వామి, రాజు, చూడామణి వర్మ, పోలీసు అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఏఆర్, సివిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






రామణ బోయిన మురళి యాదవ్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు ఫైల్ ఫోటో

# వారిపై చెడు ప్రభావం పడేలా..



ఏం తల్లో ఏమో! పిల్లలను సరిగా పట్టించుకోదు.. సమయానికి వండి పెట్టదు.. అంత చిన్న వాళ్లపై దెబ్బ ఎలా వేయాలనిపిస్తుందో.. పక్కవాళ్లు తమ చిన్నారులతో ప్రవర్తించే తీరుపై ఇలా ఎప్పుడోకప్పుడు ఇంట్లో మాట్లాడు కుంటూనే ఉంటాం కదా? మన పెంపకం తో పోలిస్తే ఆ పిల్లలకు ఏదో అన్యాయం జరిగి పోతోందని భావిస్తాం కానీ.. అది మనవాళ్లపై చెడు ప్రభావం పడేలా చేస్తుందని తెలుసా?

తమ పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా పెరగాలనే ఏ తల్లి అయినా కోరుకునేది. ఎంత ఓపికగా ఉందామనుకున్నా కొన్నిసార్లు శరీరం సహకరించకపోవడం, కుటుంబ పరిస్థితులు వగైరా సహనాన్ని కోల్పోయేలా చేస్తాయి. దాంతో ఓ దెబ్బ వేస్తారు. పోనీ.. ఆఫీసులోనో, బయటికి వెళ్లినప్పుడో ఆలస్యమవుతుంది. దీంతో కాస్త ఆలస్యంగా వండి పెట్టారు. ఇవన్నీ తప్పా ఒప్పా అన్నది పక్కన పెడితే. వీటి గురించి పదే పదే మాట్లాడితే ఆ దుష్ప్రభావం పడేది మీ పిల్లల మీదే చిన్నారులకు అమ్మానాన్నలే తొలి మార్గదర్శకులు. చాలా విషయాలు మిమ్మల్ని చూసే నేర్చుకుంటారు. మీరిలా వాళ్ల తీరు బాలేదు అని అసహనాన్ని చూపిస్తున్నాం అనుకుంటున్నారు కానీ. పిల్లలకీ ఆ అసహనాన్ని తెలియకుండానే అలవాటు చేస్తున్నారు. దీంతో వాళ్లు అన్నుకున్నది ఏది జరగకపోయినా దాన్నే ఇంట్లోనూ ప్రదర్శింస్తుంటారు. ఆ ఇంటి పరిస్థితులు మనకు తెలియదు.. అయినా జడ్జ్ చేసేసైతం. అంటే అవతలివాళ్లవైపు నుంచి ఆలోచించాల్సి న అవసరం లేదన్నది నేర్పిస్తున్నట్లేగా?

పైగా వాళ్లఇక ఏది ఇవ్వకపోయినా మంచి అమ్మానాన్నలేనా అని ఆలోచిస్తారట. ఇతరుల తల్లిదండ్రులు అన్నీ అమరుస్తుంటే వాళ్లే సరైన అమ్మానాన్నలు అనీ భావిస్తారట. అంతేకాదు, చిన్న చిన్న విషయాలకే నెగెటివ్‌గా ఆలోచించడం నేర్చుకుంటారనీ చెబుతున్నారు నిపుణులు. కాబట్టి, పిల్లల ముందు అలా ఇతర తల్లిదండ్రుల గురించి నిందిస్తూ మాట్లాడొద్దు. ఇంకా వీలుంటే వాళ్ల లేనప్పుడో,ఆరోగ్యం బాలేనప్పుడో వీలైనంత సాయం చేయండి. ఇతరులతో మంచిగా మెలగడం, సాయం చేయడం వంటివి నేర్పినవారవుతారు.

# సంప్రదాయ స్వీట్లతో నోళ్లు తీపి చేస్తూ..



తినే పదార్థాల నుంచి తాగే పానీయాల దాకా.. ప్రస్తుతం మార్కెట్లో అన్నీ కల్తీ అవుతున్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు వీటిలో ప్రిజర్వేటివ్స్ కలపడం, కంటికి ఇంపుగా కనిపించేందుకు వీటి తయారీలో ఆర్టిఫిషియల్ రంగులు వాడడం.. ఎక్కడ చూసినా ఇలాంటి పాశ్చాత్య పద్ధతులే దర్శనమిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో భారతీయ ఆహార సంప్రదాయాలకు విలువ నిస్తున్నారు బెంగళూరుకు చెందిన శ్వేతా రాజశేఖర్. కనుమరుగవుతోన్న ప్రాచీన పాకశాస్త్ర పద్ధతుల్ని వెలికి తీసి.. ఆ సూత్రాలతో ఆరోగ్యకరమైన మిఠాయిల్ని తయారు చేస్తున్నారామె. పాశ్చాత్య పోకడలు రాజ్యమేలుతున్న తరుణంలోనూ సంప్రదాయ స్వీట్లతో భారతీయుల నోళ్లు తీపి చేస్తూ.. నాటి మదురిమల్ని అందిస్తున్నారు శ్వేత. మరి ఆమె సక్సెస్ గురించి తెలుసుకుందాం..

**వ్యాపారమంటే ఇష్టం !....** నాకు ముందు నుంచీ వ్యాపారంలో స్థిరపడాలని కోరిక! పెళ్లయ్యాక ఇది మరింత బలపడింది. ఎందుకంటే నా భర్త విశ్వనాథ్ కూడా వ్యాపారవేత్తే! ప్రస్తుతం ఆయన ఇళ్ల నిర్మాణం, వ్యవసాయానినకి సంబంధించిన వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మాకు అబ్బాయి పుట్టేదాకా ఉద్యోగంలో కొనసాగిన నేను.. ఆపై జాబ్ వదిలేసి కొన్నాళ్లు ఇంటికే పరిమితమయ్యా. నా కొడుకు కాస్త పెద్దయ్యాక మావారి వ్యాపారంలో చేరాను. ఈ క్రమంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన విషయాలు, వ్యాపార మెలకువలు నేర్చుకున్నా. నేనే సొంతంగా వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచనకు వచ్చా. అది కూడా కనుమరుగవుతోన్న మన దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఉండాలనుకున్నా. అయితే ముందు నుంచీ నేను ఫుడ్ లవర్‌ని. అందులోనూ స్వీట్స్‌ని బాగా ఇష్టంగా తింటాను. 2020లో ఇండియా స్వీట్ హౌజ్ పేరుతో వ్యాపారం ప్రారంభించేలా చేసింది. అంటారు శ్వేత.

**అందుకే.. మా స్వీట్లు ప్రత్యేకం....** సాధారణంగా స్వీట్ల తయారీలో పాలు, వెన్న, నెయ్యి.. వంటి పదార్థాల్ని ఎక్కువగా వాడుతుంటారు. అయితే వీటిలోనూ మార్కెట్లో ఎక్కువగా కల్తీ ఉత్పత్తులే దొరుకుతున్నాయని గ్రహించిన శ్వేత.. అక్కడి నీలమంగళ అనే ప్రాంతంలో కర్మ ఫార్మ్స్ పేరుతో 20 ఎకరాల్లో ఓ వ్యవసాయ క్షేత్రాన్ని నడుపు తున్నారు. వివిధ రకాల మొక్కలు, చెట్లతో అలరాలే ఈ తోటలో పశుపోషణను ప్రధానంగా నిర్వహిస్తున్నారామె. మా ఫామ్‌లో దాదాపు 150 ఆవులున్నాయి. వీటి నుంచి తీసిన చిక్కటి పాలు. ఈ పాలతో తయారుచేసిన వెన్న, నెయ్యి.. వంటి స్వచ్ఛమైన పదార్థాల్ని మా స్వీట్ల తీయారీలో వాడుతున్నాం. అలాగే ఎక్కడా ప్రిజర్వేటివ్స్, ఆర్టిఫిషియల్ కలర్స్ ఉపయోగించకుండా.. సహజసిద్ధంగా, ప్రాచీన పాకశాస్త్ర పద్ధతుల్లో వీటిని తయారు చేస్తున్నాం. అలాగే ఈ మిఠాయిల తయారీలో చక్కెరకు బదులు బెల్లాన్ని ఉపయోగిస్తున్నాం. ప్రస్తుతం మా వద్ద అంజీర్ బర్ఫీ, కాజూ బర్ఫీ, కాజూ కత్లి, డ్రైఫ్రూట్ లడ్డూ, కొబ్బరి బర్ఫీ, పదుల సంఖ్యలో బెంగాలీ స్వీట్లు, ఆయా రాష్ట్రలకు సంబంధించిన ప్రత్యేకమైన స్వీట్లు తయారుచేస్తున్నాం. అలగే స్నాక్స్, పానీయాలు, చాట్స్.. వంటివీ మా వద్ద దొరుకుతాయి. ఇక ఆయా కాలాల్లో దొరికే పండ్లతో నోరూరించే మిఠాయిలు, పానీయాలు, వినియోగదారుల్ని ఆకట్టుకుంటాయి. అంటూ తన వ్యాపారం గురించి చెబుతున్నారీ బిజినెస్ లేడీ.

**ప్యాకింగూ సహజంగానే....** స్వీట్ల తయారీలోనే కాదు..



వాటిని వినియోగదారులకు అందించే ప్యాకేజింగ్ కోసం కూడా సహజసిద్ధమైన పద్ధతుల్నే అనుసరిస్తున్నారు శ్వేత. ఈ క్రమంలో ఆకర్షణీయమైన ప్యాకేజింగ్‌ని అందిస్తూనే.. ఆ బాక్సుల్ని తిరిగి ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చంటున్నారామె. నా వల్ల నా వ్యాపారం వల్ల పర్యావరణానికి హాని కలగకూడదనేది నా సిద్ధాంతం. అందుకే స్వీట్ల ప్యాకేజింగ్‌కీ ఒకసారి వాడి పడేసేవి కాకుండా.. తిరిగి ఉపయోగించుకునే స్వీట్ బాక్సులు, కంటెయినర్స్‌నే వాడుతున్నా. అలాగే ఆయా సందర్భాల్ని బట్టి మా ప్యాకేజింగ్ కూడా విభిన్న శైలిలో ఉంటుంది. అందుకే స్వీట్ల రుచిలోనే కాదు.. ప్యాకేజింగ్ లోనూ మీ స్టైలే వేరు అంటుంటారు చాలామంది కస్టమర్లు. అంటూ చెప్పుకొచ్చారు శ్వేత.

**బ్యాలన్సింగ్.. తేలికే !...** తన వ్యాపారంతో నలుగురూ ఉపాధి పొందాలని కోరుకున్న శ్వేత. తన సంస్థలో ఎక్కువమంది మహిళల్ని పనిలో పెట్టుకున్నట్లు చెబుతున్నారు. నా చుట్టూ ఉండే మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నా సంస్థలో మహిళల్నే ఎక్కువగా పనిలో పెట్టుకున్నా. ఇక చాలామంది మీరు ఇటు ఇంటిని, అటు బిజినెస్‌ను ఎలా బ్యాలన్స్ చేయగలుగుతున్నారు అని అడుగుతుంటారు. నా దృష్టిలో ఇది కష్టమనుకుంటే కష్టం. తేలిక అనుకుంటే తేలిక. సరైన ప్రణాళిక, సమయపాలనతోనే ఈ రెండింటినీ బ్యాలన్స్ చేయగలుగుతున్నా. అలాగే మా వారి ప్రోత్సాహం కూడా నన్ను ముందుకు నడిపిస్తోంది. సవాళ్లు అనేవి ప్రతి రంగంలో సహజం. వాటిని అధిగమించి, సృజనాత్మకంగా ఆలోచించినప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలం.. అంటూ తన మాటలతో ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తల్లో స్ఫూర్తి నింపుతున్నారీ మామ్ అంత్రప్రెన్యూర్. ప్రస్తుతం బెంగళూరు వ్యాప్తంగా 30కి పైగా స్టోర్స్‌ని ఏర్పాటుచేసిన శ్వేత.. త్వరలోనే ఇతర రాష్ట్రాలకూ తన వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు చెబుతున్నారు.

# తేనెతో ఆ మచ్చలు దూరం



తేనె వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్న విషయం తెలిసిందే. ఆరోగ్యానికే కాదు.. సౌందర్య పరిరక్షణలోనూ తేనె ఎంతగానో ఉపయోగపడు తుంది. మరి అదెలాగో తెలుసుకోవాలనుకుంటున్నారా?

- కాలి గాయాల పైన తేనెను పూయడం నల్లమచ్చలు పడవు.
- మొటిమల మీద తేనెను రాయడం వల్ల అతి త్వరగా తగ్గుతాయి.
- తేనె రాయడం వల్ల మొటిమల మచ్చలు చర్మపు రంగులో కలిసిపోతాయి.
- తేనె చర్మకాంతిని పెంచడమే కాకుండా చర్మంలో తేమ ఉండేలా చేసి మృదువుగా మారుస్తుంది. అంటే చక్కటి మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడుతుందన్న మాట.
- మోచేతులు, మోకాళ్ల దగ్గర చర్మం నల్లగా మారిందా..? తేనెను పూయడం వల్ల ఈ నలుపు తగ్గి మృదువుగా మారుతుంది. పరగడుపున తేనె, నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల త్వరగా సన్నబడే అవకాశాలు ఎక్కువ.
- రోజూ తేనెను తీసుకోవడం వల్ల రక్తశుద్ధి జరిగి చర్మం కాంతులీనుతుంది.



**ఇవి కూడా...**

- తేనె జుట్టుకు సహజ కండిషనర్‌గా ఉపయోగపడుతుంది.
- తేనె, ఆలివ్ ఆయిల్ కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత తల స్నానం చేయడం వల్ల జుట్టు పట్టులా మెరుస్తుంది.
- తలస్నానం చేసేముందు తేనె, పాలు కలిపి తలకు పట్టిస్తే జుట్టు ఒత్తుగా,ఆరోగ్యంగా తయారవుతుంది.
- టీ, కాఫీ,జ్యూస్, స్వీట్స్, సలాడ్స్‌లో చక్కెరకు బుదులుగా తేనెను వాడొచ్చు. దీనివల్ల బరువు తగ్గే అవకాశాలుంటాయి.

# సాధనం చిన్నది.. సాయం పెద్దది

ఘాటైన పరిమళాలు వెదజల్లే వెల్లుల్లిని అనేక వంటల్లో ఉపయోగిస్తాం. వీటిని వంటకు అనుకూలంగా మెదిపేందుకు వీలుగా ఉండే పరికరం మాన్యువల్ గార్లిక్ గ్రైండర్ అతి తక్కువ బరువుతో, ఆకర్షణీయంగా కనిపించే ఈ సాధనానికి కరెంట్‌తో పనిలేదు.



దీంతో వెల్లుల్లి మాత్రమే కాదు పండ్లు, అల్లం, ఉల్లి, టొమాటోలు-ఇలా అన్నిటికీ ఉపయోగించ వచ్చు. ఈ చిన్న సాధనం వంటలో ఎంతో సాయం చేస్తుంది. సిలికాన్ బేస్ వల్ల స్థిరంగా ఉంటుంది. ఎక్కువకాలం

# రక్తహీనత లేకుండా..



వర్షం సాక్షిగా వీలైనప్పుడల్లా వేడివేడి మొక్కజొన్న పొత్తును లాగిం చేస్తాం కదా.. ఏదో కాలక్షేపానికి తినడమే కాదు. ఇది ఆరోగ్యాని కీ ఎంతో మేలు చేస్తుంది. ఎలాగంటే..

- మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే రక్తహీనత సమస్య నుంచి రక్షిస్తుంది. రక్తాన్ని వృద్ధిచేస్తుంది.
- దీన్ని తరచూ తింటే పేగులకు బలం చేకూరుతుంది.
- మూత్రపిండాల సమస్యలను నివారించడానికి తోడ్పడుతుంది.
- మూత్రపిండాల్లోని రాళ్లను కరిగించడానికీ సాయపడుతుంది.
- పక్క తడిపే అలవాటును మాన్పించాలంటే.. తరచూ దీన్ని పిల్లలకు తినిపించాలంటారు నిపుణులు.
- ఇది మూత్రంలో మంటను తగ్గిస్తుంది.
- ఈ కాలంలో తరచూ వచ్చే జలుబూ, దగ్గుల నివారణకు ఉపయోగపడు తుంది.

# ఒక్క ఆపిల్‌లో..

ఒక్క ఆపిల్ లో పదికోట్ల బ్యాక్టీరియా ఉంటుంది. రోజుకో ఆపిల్ తింటే.. ఎన్నో రకాల వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని మనకు తెలుసు. కానీ, ఒక్క ఆపిల్‌ను తింటే 10 కోట్ల బ్యాక్టీరియాలు మన పొట్టలోకి చేరినట్టే అని మీకు తెలుసా! మరీ అంత ఆశ్చర్యపోకండి. అదంతా మనకు మంచి చేసే బ్యాక్టీరియానే! అవును .. 240 గ్రాముల బరువున్న ఒక ఆపిల్‌లో సుమారు 10 కోట్ల బ్యాక్టీరియా ఉంటుందట. తాజాగా ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఆపిల్‌లోని కాడ, గుజ్జు, విత్తనాలు, తొక్క.. ఇలా ప్రతి భాగమూ.. బ్యాక్టీరియా మయమేనట. ఇక గుజ్జు, విత్తనాలైతే బ్యాక్టీరియా హాట్‌స్పాట్‌లే. అయితే, సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆపిల్ రకాలే ఉత్తమం అంటున్నారు పరిశోధ నలు. ఎందుకంటే, ఈరెండు రకాల ఆపిల్ పండ్లలో బ్యాక్టీరియా సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, అందులో ఉండే మంచి బ్యాక్టీరియాలో మాత్రం తేడా ఉంటుందట. పంట పండే ప్రాంతం, భద్రపరిచే విధానాలను బట్టి వాటిలోని మైక్రోబయోమ్‌ల కంపోజిషన్ మారిపోతుందట. దాన్నిబట్టే ఆపిల్ రంగూ, రుచీ, రూపంలోనూ మార్పులొస్తాయట. ఏదిఏమైనా ఈ ఆపిల్‌లో ఓ బ్యాక్టీరియా సామ్రాజ్యమే ఉందన్నమాట! ఇంతకూ ఈరోజు మీరు మీ పొట్టలోకి ఎన్ని కోట్ల బ్యాక్టీరియాను పంపారు.



# వర్షాకాలంలో వంటింట్లో !

**ఈ సీజన్‌లో నిత్యావసర వస్తువులు, కాయగూరలు, పండ్లు, ఆకుకూరలు, మిగిలిన ఆహార పదార్థాలను సరైన పద్ధతిలో నిల్వ చేయాల్సి ఉంటుంది. లేదంటే త్వరగా పాడయ్యే ప్రమాదం ఉంది.**

అత్యవసరానికి ఉపయోగపడేలా కట్ చేసి ఫ్రిజ్‌లో భద్రపరిచే క్యారెట్, బీన్స్, అలాగే ఒలిచిన బఠాణీ, మొక్కజొన్న గింజలను పొడి డబ్బాల్లో నింపాలి. తడి లేదా చెమ్మను పీల్చే సిలికకా జెల్ ప్యాకెట్స్ మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటిని ఈ డబ్బాల్లో ఉంచితే చాలు.కట్ చేసిన కూరగాయల నుంచి వచ్చే తేమను ఈ ప్యాకెట్స్ పీల్చుకోవడంతో పాడవకుండా ఉంటాయి. అలాగే కూరగాయలను ముందుగా తడి లేకుండా పొడి వస్త్రంతో తుడిచి గాలికి ఆరనివ్వాలి. ఆ తర్వాత పొడిగా ఉండే ప్లాస్టిక్ కవర్లలో నింపి లోపల కాస్తంత చోటు ఉండేలా వదులు చేసి అందులో టిష్యూ ఉంచాలి. కవర్‌ను గాలి చొరబడకుండా ముడి వేయాలి. వీటని ఫ్రిజ్‌లో ఉంచితే చాలు. కాయగూరల నుంచి వచ్చే తేమను టిష్యూ పీల్చుకుంటుంది. దీంతో వారం రోజులపాటు కవర్లలో ఉన్నవి తాజాగా ఉంటాయి. అలాగే ఆకుకూరలను పేపర్‌టవల్‌లో చుట్టి, ఆ తర్వాత పొడి ప్లాస్టిక్ కవర్లలో ఉంచి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే చాలు. వారం రోజులైనా పాడవకుండా ఉంటాయి. అంతేకాదు,ఓ డబ్బాలో అడుగున టిష్యూ పరిచి కరివేపాకు లేదా కొత్తిమీర నిపాలి. తిరిగి పైన మరో పేపర్‌టవల్ కప్పి డబ్బా మూత పెట్టాలి. భద్రపరిస్తే రెండు వారలకు పైగా తాజాగా ఉంటాయి.



**ఆహార పదార్థాలు..** అన్నం మిగిలిన కూరలు తదితర ఆహార పదార్థాలనుఫ్రిజ్‌లో భద్రపరచాలనుకుంటే ముందుగా చల్లార్చి ఆ తర్వాతే నిల్వ ఉంచాలి. అలా కాకుండా వేడివేడి పదార్థాలను ఉంచితే వాటి నుంచి వచ్చిన ఆవిరి అందులోనే ఉండి ఆహారాన్ని పాడయ్యేలా చేస్తుంది. అలాగే ఫ్రై చేసిన ఆహారపదార్థాలు ఈ సీజన్‌లో త్వరగా మెత్తబడతాయి. అలా కాకుండా ఉండాలంటే అడుగున పేపర్‌టవల్ పీల్చుకొని ఆహారపదార్థాన్ని మెత్తబడనివ్వకుండా, క్రిస్పీగా ఉంచు తుంది. అలాగే పప్పుదినుసులు నింపే డబ్బాల్లో ఒక ఎడుమిర్చి లేదా బిరియానీ ఆకు వేసి మూత పెడితే మంచిది. వాతావరణంలోని తేమకు పురుగుపట్టదు. వంటింటి దిమ్మ, కబోర్డుల వద్ద పరిశుభ్రత పాటించాలి. కడిగిన గిన్నెలను అరనిచ్చి పొడి వస్త్రంతో తుడిచిన తర్వాతే అలమరలలో సర్దుకోవాలి. లేదంటే ఆ చెమ్మకు బొద్దింకలు లేదా చిన్నచిన్న పురుగులు చేరతాయి. వంటగదికి ఎగ్జాస్ట్ ఫ్యాన్ తప్పనిసరి. అప్పుడే వంటగది పొడిగా పొడిగా ఉండి, బ్యాక్టీరియాలకు నివాసం కానివ్వదు.

# ధైర్యమే ఆయుధం



స్వామి వివేకానంద పరివ్రాజక సన్యాసిగా దేశమంతా పర్యటిస్తూ వారణాసి వెళ్లారు. ఆంజనేయ ఆలయం దర్శించుకొని తిరిగొస్తున్నారు. ఇంతలో కోతుల సమూహం కనిపించింది. అన్ని కోతులు ఒకేసారి ఎదురొచ్చే సరికి ఏం చేయాలో తోచక వెనుతిరిగారు. అవి వెంబడించసాగాయి. స్వామీజీ నడక వేగాన్ని పెంచారు. మర్కటాలూ అంతే వేగంగా తరమసాగాయి. నిస్సహాయస్థితిలో స్వామీజీ అటూ ఇటూ చూస్తున్నారు. ఇంతలో దగ్గర్లో చెట్టుకింద ఓ వృద్ధసాధువు 'అవేమీ చేయవు. భయపడకుండా ధైర్యంగా ఎదుర్కో అని హితవు పలికారు. దాంతో వివేకానంద పరుగు ఆపి నిర్భయంగా, స్థిమితంగా నిలబడ్డారు. తదేక దీక్షతో కోతుల వంక చూశారు. అంతే అవి తోకముడిచి పారిపోయాయి. కొన్ని సంవత్సరాల తర్వాత స్వామీజీ న్యూయార్క్‌లో ప్రసంగిస్తూ వారణాసి సంఘటన ప్రస్తావించారు. ఆ ఉదంతం నుంచి దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవాలనే పాఠం నేర్చుకున్నాను. సమస్యలను చూసి పారిపోకుండా నిర్భయంగా నిలిస్తే ఎంతటి భయానక పరిస్థితులైనా చక్కబడతాయి. ఎదురుతిరిగితే అవే పారిపోతాయి. పిరికివాళ్లకు పిల్లి కూడా పులిలాగే కనపిస్తుంది. ధీశాలులు పులిని చూసినా భయపడరు. వాళ్లను ఏ అవాంతరాలూ అడ్డుకోలేవు. ధైర్యమే ఆయుధమౌతుంది అంటూ



# హరాభరా కబాబ్

**కావలసినవి :** శనగపిండి-పావుకప్పు, బంగాళదుపంలు-మూడు, బచ్చలి తరుగు-రెండు కప్పులు, పచ్చి బఠాణీలు- అరకప్పు, పచ్చిమిర్చి-రెండు, అల్లం-అంగుళం ముక్క, ఛాట్ మసాలా, ఆమ్‌చూర్ పొడర్- చెంచా, చొప్పున, గరం మసాలా-పావు చెంచా, నూనె, ఉప్పు-తగినంత, జీడిపప్పు-చారెడు.

**తయారీ :** కడిగిన బచ్చలికూరను రెండు నిమిషాలు వేడి నీళ్లలో ఉంచి, తీసి చల్లటి నీళ్లలో వేయాలి. నిమిషం తర్వాత నీళ్ల వడకట్టేసి.. సన్నగా తరిగి పక్కనుంచాలి. శనగపిండిని తక్కువ సెగ మీద కాస్త వేయించి.. మంచి వాసనరాగానే దించేయాలి. బంగాళదుంపలు, పచ్చి బఠాణీలను ఉడికించు కోవాలి. అల్లం, పచ్చిమర్చిలను కచ్చాపచ్చా దంచాలి. ఒక పాత్రలో బచ్చలి తరుగు, పొట్టు తీసిన బంగాళదుంపలు, ఉడికించిన బఠానీలు, అల్లం మిర్చి ముద్ద వేసి పప్పుగుత్తితో మెదపాలి. అందులో శనగపిడి, ఛాట్ మసాలా, ఆమ్‌చూర్ పొడర్, గరం మసాలా, ఉప్పు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా తీసుకుని చేత్తో వడల్లా చేసి, ఒక్కో దాని మీద జీడిపప్పులు గుచ్చినట్లుగా పెట్టాలి. పెనం మీద కాస్త నూనె వేసి వీటిని వేయించాలి. అంతే.. ఘుమఘుమలాడే హరాభరా కబాబ్ రెడీ.



# అరచేతులు మృదువుగా..



**ఉదయం టిఫిన్లు,** మధ్యాహ్నం భోజనం, రాత్రికి మళ్లీ ఏ చపాతీలో, పుల్కాలో చేసుకుంటాం. ఇదంతా ఒక ఎత్తయితే వంట అయిన తర్వాత పాత్రలు శుభ్రం చేసుకోవడమైతే పెద్ద ప్రవాసమే. గిన్నెలో డిష్‌వాష్ లిక్విడ్ పోసుకుని దాంట్లో స్పాంజి ముంచి పాత్రలను గట్టిగా రుద్దితే గానీ మురికిపోదు. ఈ పనులన్నీ ఎంత జాగ్రత్తగా చేసినా.. లిక్విడ్ అంటుకుని కొన్నాళ్లకు మెత్తగా ఉండే అరచేతులు కాస్తా గరుగ్గా మారిపోతాయి.కొందరికైతే అలర్జీలూ వచ్చేస్తాయి. ఈ బాధలన్నీ లేకుండా ఉండాలంటే ఇలాంటి బ్రష్ మన దగ్గర ఉంటే చాలా సౌకర్యంగా ఉంటుంది. పాత్రలను శుభ్రంచేసే లిక్విడ్‌ను దీంట్లోనే పోసుకుని పైన పట్టుకుని పాత్రలను రుద్దుకుంటే సరిపోతుంది. పైగా జారిపోకుండా పట్టుకోవడానికి ఇది అనువుగానూ ఉంటుంది.

IN THE COURT OF THE Ist ADDL. DISTRICT JUDGE ANANTHAPURAMU
A.S NO: 51/2024
Between:
Obulanayanipalli Aswarthamma ....Appellant
And
D.Vasundhara Devi and Others ...Respondants
Notice to the Respondant NO:3
R3: Prabhakar Chowdary, S/o Gopal Naidu, Head Clerk, Office of Regional Provident Fund Commissioner, Kadapa.
పై నెంబరు కేసులో 3వ Respondant అయిన మీ హాజరు నిమిత్తము 27-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
D.Shyam Sunder, K. Mohan Rao
Advocates, Anantapur Cell:9440258700

# టిడిపి నాయకుల అండతోనే నకిలీ మద్యం తయారు

ప్రొద్దుటూరు అక్టోబర్ 5 ప్రభాతవార్త

రాష్ట్రంలో టిడిపి నాయకుల అండతో నకిలీ మద్యం తయారుచేసి నేరుగా బెల్ట్ షాపులకు తరలించి గ్రహించడంతో నకిలీ మద్యం సేవించిన సామాన్య ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసే ఫ్యాక్టరీని కనుక్కొని బట్టబయలు చేసిందన్నారు. నకిలీ మద్యం తయారీలో కూటమి ప్రభుత్వ నాయకుల అండదండలతోనే మాఫియా నడిచిందని విమర్శించారు. కేవలం మొలకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రంలో పనిచేసే కూలీలపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేసిందే తప్ప అసలు దోషులను బట్టబయలు చేయలేదని తెలిపారు. ఎన్ బ్రాండ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారు చేసి నేరుగా బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారని అక్కడి నుండి విక్రయాలు జరిపి ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ బ్రాండ్ పేరుతో తయారవుతున్న మధ్యాన్ని ఎవరు సేవించవద్దని రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలా సేవిస్తే మీ ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. గత ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నాణ్యమైన మద్యం అందిస్తాననీ ప్రజలకు మోసపూరితమైన వాగ్దానాలు చేసి నేడు చేస్తున్నది ఏంటని ఆయన అండజేశారు ఎన్ బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం తయారుచేసి విక్రయాలు జరుపుతున్నారని విమర్శించారు. ఈ విక్రయాల వల్ల వస్తున్న వాటాలు అధినాయకుల వరకు చేరుతున్నాయని అ



న్నారు. గత వైసిపి పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని అందించిందన్నారు. కానీ నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు జె బ్రాండ్ మద్యం తయారు చేసే ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శలు చేశారని గుర్తు చేశారు. టిడిపి నాయకులు అండతోనే నకిలీ మద్యం తయారవుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఒకవేళ కూటమి ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరపకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌లో నమోదు చేసి రాబోయే వైసిపి ప్రభుత్వం లో సమగ్ర విచారణ జరిపే అసలు దోచులను శిక్షిస్తామని హెచ్చరించారు. అనంతరం వైసిపి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్కులో మొలకలచెరువు నకిలీ మద్యం ఉదంతాన్ని ఆయన నమోదు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్ లు వరికుంటి ఓబులరెడ్డి రాగుల శాంతి గుర్రం లావణ్య మన్నె సత్యం వైసీపీ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లదేసి జంగమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో మితిమీరిపోతున్న భూ కబ్జాలు



బద్వేలు, అక్టోబర్ 5, ప్రభాతవార్త

మండల పరిధిలోని తిప్పనపల్లె,వీరబల్లి గ్రామ పొలాలలో రాత్రికి రాత్రే జెసిబిల ద్వారా ప్రభుత్వ భూములను కబ్జా చేయటం దుర్మార్గమని ఈ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన ప్రతి పేదవారికి రెండు ఎకరాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను ఆ పార్టీ బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ మండలం తిప్పనపల్లె వీరబల్లె గ్రామ పొలం నందు సర్వేనెంబర్ 364లో 13 ఎకరాల పైబడి 381,82,83,84, 85, సర్వే నెంబర్లలో 50 ఎకరాల పైబడిలో జెసిబిల ద్వారా కంప చెట్లు తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేయడం చూస్తుంటే నేతలు ఏ మేరకు బరితెగించారో అర్థమవుతుందన్నారు. ఒకవైపు రెవిన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్తున్నా ఆ బోర్డులను తొలగించి శనివారం ఆదివారం అదును చూసుకొని యంత్రాలతో పనిచేస్తుంటే పార్టీ పెద్ద స్థాయి నేతలు కింది స్థాయి నేతలకు అభయహస్తం ఇచ్చినట్లు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. బద్వేల్ నియోజకవర్గం లోని ముఖ్యంగా బద్వేల్ నియోజకవర్గం లోని బద్వేలు గోపవరం మండల పరిధిలో వేలాది ఎకరాలు కబ్జాకు గురవుతున్న నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు ఉన్నారని వారిని నిద్రమత్తు నుండి లేపాల్సిన ఉన్నత స్థాయి అధికారులు పంచాయతీలు చేసి పార్టీ నేతలకు వాటాలిస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే నియోజకవర్గ వ్యాప్తంగా కబ్జా అయిన ప్రభుత్వ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి ఆక్రము గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అక్రమ దారులపై ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకొని అర్హులైన పేదలకు పంచాలని వారు కోరారు. ఆక్రమిత భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆ విధంగా స్వాధీనం చేసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లోగా వైసిపి ఖాళీ



సిద్దవటం అక్టోబర్ 5 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల్లోగా వైసిపి పార్టీ ఖాళీ అవుతుందని రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ జోష్యం చెప్పారు. మండలంలోని పెద్దపల్లి గ్రామపంచాయతీ శివుని పల్లె గ్రామంలో ఆదివారం వైసీపీ నుంచి దాదాపు 150 కుటుంబాలను జనసేన పార్టీలోకి రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సక్సస్ అయ్యాయన్నారు. కూటమి ప్రజా రంజక పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. జనసేన పట్ల ఆకార్షితులైన ప్రజలు వైసీపీ నుంచి జనసేన వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నరన్నారు. ఇతర పార్టీల నుంచి జనసేన చేరికలతో రోజు రోజుకూ జనసేన క్రేజ్ పెరిగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాలరామయ్య,అతికారి చిన్న వెంకటయ్య,చలపాటి చంద్ర, దేరంగుల శ్రీకాంత్,మచ్చా సుబ్బరాయుడు,షేక్ మహబూబ్ బాషా,చిన్న కొండ విజయ్, అవ్వారు రవిశంకర్, పసుపులేటి గంగయ్య పాల్గొన్నారు.

## గ్లోబల్ గ్యాన్ అవార్డ్స్

కడప, అక్టోబర్ 5, ప్రభాతవార్త

గ్లోబల్ గ్యాన అకాడెమీ మరియు కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ సంయుక్తంగా 6 వ ఇంటర్ నేషనల్ టీచర్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమం కె ఓ ర్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రుక్సానా , మేనేజింగ్ డైరెక్టర్ గ్లోబల్ గ్యాన్ , ప్రైవేట్ రంగాలలో ఉంటూ విద్యార్థుల ఉన్నతి గురించి ఆలోచిస్తూ వారి వృత్తి పరంగా ఉన్నత సేవలందిస్తున్న మరియు క్యారెర్ తీర్చిద్దితూ., మరెన్నో రంగాలకు దోహద పడుతూ, వివిధ అంశాలలో తమ ప్రతిభ కొనసాగిస్తున్న వారి ప్రసంగాన్ని కొనసాగించారు. గౌరవ ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఏవిస్‌స్ కుమార స్వామి గుప్త, డైరెక్టర్, ఐఐఐటీ ఇదుపులపాయి, అవార్డ్ గ్రహీతలను అభినందిస్తూ అపార మేధా సంపత్తి ఏర్పరచుకొని భవి తారలను అందిస్తున్న గురువులందరికి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు మరియు గుప్త ఉపాధ్యాయ వృత్తిలో వారి గురుతర బాధ్యతలు వివరించారుసమాజములో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో శక్తి వంతమైనదని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు సరిగా తీర్చిదిద్దిన జాతిరత్నాలు కాగలరన్నారు. ఉపాధ్యాయులు తమ శిష్యులను ప్రతిభవంతులుగా తీర్చిదిద్దిన నాడు గురువు గౌరవము పెరుగుతుందన్నారు. కెఎస్ఆర్ఎమ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న ప్రపం చానికి అనుగుణంగా విద్యాబోధన చేయవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కందుల విద్యా సంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ మేనేజంగ్ డైరెక్టర్ రుక్సానా. ఆంధ్రప్రదేశ్ తెలంగాణా అంబాసిడర్ సమతా నాయుడు,కందుల లక్ష్మమ్మ మెమోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్ నగరత్నమ్మ, కెఎస్ఆర్ఎమ్ కళాశాల హెచ్ఓడిలు ప్రియదర్శిని, రామచంద్రారెడ్డి ,తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను గుర్తించి జ్ఞాపికలు ప్రశంసా పత్రాలు శాలువాలతో సత్కరించారు. చివర ముఖ్య అతిధులు డాక్టర్ పసుపులేటి శంకర్, డాక్టర్ ఏ వి స్ స్ కుమార స్వామి గుప్త, డైరెక్టర్, ఐఐఐటీ ఇదుపులపాయి, నాగేశ్వర పసాద్ లను నిర్వాహకులు సన్మానించారు.



## ఆరుగురు జూదరుల అరెస్టు

ముద్దనూరు.అక్టోబర్ 05 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కోనాపురం గ్రామ సమీపంలోనీ కొండ ప్రాంతంలో ఆదివారం ఆరుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు ఎస్సై మైనుద్దీన్ సమాచారం రావడంతోతోటి సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10,250 రూపాయలు నగదు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా జూదం మట్కా లాంటి అ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సందర్భంగా హెచ్చరించారు.

## కనీస వేతనం అమలు చేయాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న సాంబశివ

జిల్లాలోని ప్రభుత్వ పాటశాలల ఆయాలకు, వాచ్‌మెన్‌లకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం బి.కొత్తకోటలోని పాఠశాలల, ఆయాలు, వాచ్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సాంబశివ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌లకు కేవలం రూ.6వేలు మాత్రమే ఇస్తుండడం అన్యాయమన్నారు. రోజంతా పాఠశాలలోనే కష్టపడుతున్న కార్మికులు ప్రభుత్వ సేవలో భాగమైన వారికి కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ వంటివి కల్పించడం లేదన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 5నెలల వేతనాలు చెల్లిస్తూ సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపప్రధాన కార్యదర్శి సలీంబాషా, నరసింహులు, తంబళ్ళపల్లె నియోజకవర్గ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, ఆయాల సంఘం జిల్లా కార్యదర్శి యశోదమ్మ, ఏఐటియుసి నాయకులు బాలక్రిష్ణ, ఆయాలు లక్ష్మిదేవి, వెంకటలక్ష్మి, నరసమ్మ, వాచ్‌మెన్‌లు గంగప్ప, రెడ్డప్ప పాల్గొన్నారు.

## వైసిపి పాలనలోనే అధికంగా కల్తీమద్యం కేసులు

### రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్

మదనపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

తంబళ్ళపల్లె నియోజకవర్గం మొలకలచెరువులో కల్తీ మద్యం వ్యాపారం సంచలనం కలిగించిందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్‌నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ కల్తీమద్యం తయారీని టిడిపి తీవ్రంగా పరిగనిస్తుందన్నారు. గత వైసిపి పాలనలోనే అధికంగా కల్తీ మద్యం కేసులు నమోదు అయ్యాయని, కల్తీ మద్యం తాగి మృతిచెందిన సంఘటనలు వెలుగు చేశామన్నారు. ములకలచెరువులో కల్తీ మద్యం తయారీలో పార్టీ ఇన్‌చార్జ్ ప్రమేయం లేదని విదేశాల నుంచి వీడియో ద్వారా జయచంద్రారెడ్డి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అక్రమ మద్యం తయారీ కేసులో నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారే పార్టీ మారిన వారి పద్ధతులు మార్చుకోవడం లేదని అలాంటివారే ఇలాంటి అక్రమాలకు తెరతీసి పార్టీకి చెడ్డపేరు తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాచవేటివారిపల్లె గ్రామకమిటీ అధ్యక్షులు మల్లికార్జున, గండికోట గణేష్‌బాబు, రామచంద్రనాయుడు, రామాంజులు, వట్టికొండ రెడ్డప్ప, వేణుగోపాల్, విద్యాసాగర్, కంచపు రెడ్డప్ప, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

### ఏపి కిసాన్ కాంగ్రెస్ ఛైర్మెన్ ప్రభాకర్‌రావు

మదనపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త :




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపి కిసాన్ కాంగ్రెస్ ఛైర్మెన్ కామన ప్రభాకర్‌రావు, జిల్లా ఛైర్మెన్ దుగ్గనపల్లి సురేంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లె టమోటా మార్కెట్‌లో రైతులను కలసి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకొన్నామన్నారు. తక్కువ నీరు ఉన్న డ్రిప్ పరికరాలతో ఎన్నో ఇబ్బందులు నడుమ పంటను సాగు చేస్తున్నామని, మార్కెట్‌కు వచ్చాక గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నట్లు పేర్కొన్నారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జాక్‌పాట్ విధానాన్ని తొలగనించి దళారీ వ్యవస్థను పూర్తి స్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సురేంద్రారెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మామిడి పంట కూడా అధికస్థాయిలో సాగులో ఉందని ప్రతి నియోజకవర్గానికి కోల్డుస్టోరేజ్‌లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రైతులు ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పరిస్థితి ఎలా ఉందో కూటమి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ రైతులు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని గతంలో రుణమాఫి చేసిన ఘనత కూడా పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డినిగార, సుల్తాన వివిధ జిల్లాల కిసాన్ కాంగ్రెస్ ఛైర్మెన్‌లు పాల్గొన్నారు.

## పూర్వపు విశ్వార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముద్దనూరు,అక్టోబర్ 05 ప్రభాతవార్త:



పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆతీయంగా ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, కార్యక్రమాలు అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు.

## సమాజాభివృద్ధిలో పునరంకితమవ్వాలి : ఎమ్మెల్సీలు




జమ్మలమడుగు, అక్టోబరు 5, ప్రభాతవార్త:

ఉపాధ్యాయులు సమాజాభివృద్ధిలో పునరంకితమవ్వాలని ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రాంగోపాల్‌రెడ్డిలు సంయుక్తంగా తెలిపారు. ఆదివారం కడపలో జమ్మలమడుగుకు చెందిన బాలాజీ హైస్కూలు సీనియర్ ఉపాధ్యాయులను మహ్మద్ బాషా(గణితం), వెంకటప్రసాద్ (హిందీ), సంపూర్ణ(ఎలిమెంటరీ) అపుస్మా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని అపుస్మా ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ సన్మానంతో వారు మరింత బాధ్యత పెరిగిందన్నారు. తల్లిదండ్రుల తరువాత విద్యతో పాటు విలువలతో కూడిన క్రమశిక్షణ నడవడిక నేర్పించాలన్నారు. అనంతరం సన్మాన గ్రహీతలు బాషా, ప్రసాద్, సంపూర్ణ, రవీంద్రారెడ్డికి, కరస్పాండెంట్ దీప్తి నికిలారెడ్డికి, ఏవో ప్రసాద్‌రెడ్డిలు ఈ సన్మానానికి మమ్మల్ని అధ్యక్షులుగా గుర్తించి అపుస్మా చేత అర్హులుగా గుర్తించి అపుష్మ చేత గౌరవాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షేమ అధికారులు పై విచారణ జరిపించాలి

ఎడ్యుకేషన్ అక్టోబర్ 5 ప్రభాతవార్త :



కడప,అన్నమ్మయ్య జిల్లాలో ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వేనక బడిన తరగతుల సంక్షేమ శాఖలో వున్నా వసతి గృహాల అధికారుల అక్రమాలపై విచారణ చేపట్టాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. కడప,అన్నమ్మయ్య జిల్లాలో ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న వసతి గృహాలలో విద్యార్థులు చదువులు అభ్యసిస్తున్నారని వారి పరవేక్షణకు వసతి గృహ అధికారులు వ్యవహరిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యత లేకుండా చేస్తూ వసతిగృహ అధికారులు పైస్థాయి అధికారులు ఎస్‌డబ్ల్యూఓ, సహాయ సంక్షేమ అధికారులు, నుండి పై స్థాయి జిల్లా అధికారుల వరకు ప్రతినెల మామూలు తీసుకున్నట్లు అందుకు నిదర్శనమే ఇంచార్జి వసతి గృహాధికారులు సమీప వసతి గృహలు ఇంచార్జిగా నియమించకుండా వారి దగ్గర వేలాది రూపాయలు డబ్బులు తీసుకొని దూరం వున్నా వారిని ఇంచార్జిగా వసతి గృహాధికారులును నియమించారని, స్థానికంగా వసతి గృహాధికారులు ఉండవలసి ఉండగా ఉండటం లేదన్నారు. అధికారులు స్పందించి విచారణ జరిపి బాధ్యులైన ఎస్సీ,బిసి సంక్షేమ శాఖ అధికారుల పై చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మహేష్,ఫాజీల్, శ్రీను పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం

కలికిరి, అక్టోబరు 5, ప్రభాతవార్త:

కలికిరి మండలం మహల్ నందు ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. వైద్యులు డా.ఆనంద్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిలు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. అధిక సంఖ్యలో రోగులు ఈ వైద్యశిబిరానికి హాజరు కావడంతో విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమంలో కాంతమ్మ, నారాయణమూర్తి, అక్కులప్ప, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## అద్వైత గురుకులం ఉపాధ్యాయులకు పురస్కారం



గాలివీడు, అక్టోబర్ 5(ప్రభాతవార్త):

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అద్వైత గురుకులం ఉపాధ్యాయులు కొండ కిరణ్‌కుమార్, టమటం మనోహర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మోడెం శివశంకర్‌లకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలోని గోపీకృష్ణ హైస్కూల్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. అవార్డు పొందిన ఉపాధ్యాయులను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ఇంద్రసేన మాట్లాడుతూ తమ పాఠశాల నుండి పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడం హర్షణీయమన్నారు.

## పూలికుంటలో పొలిమేర దేవర

గాలివీడు, అక్టోబర్ 5(ప్రభాతవార్త):



మండలంలోని పూలికుంట గ్రామం పొలిమేరలో వెలసిన గంగమ్మకు దేవర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి యేటా ఆశ్వయుజ మాసంలో ఆదివారం పొలిమేర గంగమ్మకు గ్రామస్తులు దేవర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పూలికుంట, కొర్లకుంట గ్రామాల సరిహద్దులో దేవర చెలిమ వంకలో వెలసిన పొలిమేర గంగమ్మకు బోనాలు సమర్పించి జంతుబలులు ఇచ్చి ప్రజలందరూ సహపంక్తి భోజనం చేయడంతో దేవర ముగిసింది.

## వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

సుండుపల్లి, అక్టోబర్05, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామం కొండల తూర్పులో ఆకేపాటి అమర్నాథరెడ్డి ఆదివారం గ్రామస్తుల బాగోగులను అడిగి తెలుసుకుని గ్రామంలోని సమస్యలపై ఆరా తీశారు. మండలంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామ కమిటీలలో పర్యటించి గ్రామ కమిటీ నాయకులు మరియు సభ్యులతో మమేకమై కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి వైఎస్ఆర్ సి పి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామస్వామి రెడ్డి, ఆరం రెడ్డి, జడ్పిటిసి ఇస్మాయిల్, రెహమాన్ ఖాన్, మధుసూదన్ రెడ్డి, చంద్రనాయక్ ,నాగేంద్ర నాయక్, బాబు రెడ్డి, కమ్మి రెడ్డి, మోహన్ రెడ్డి, మధు, రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 20 బస్తాల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

సిద్దవటం అక్టోబర్ 5 ప్రభాతవార్త

సిద్దవటం మండలంలోని మాధవరం1 గ్రామ పంచాయతీ మహబూబ్ నగర్ గ్రామంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాల అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు సిద్దవటం ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో రెవిన్యూ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో పట్టుబడిన 681 కేజీ ల బియ్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అక్రమంగా రేషన్ తరలిస్తున్న సిద్దవటం గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పేరు చెప్పి విమర్శించే ధైర్యం లేని ప్రవీణ్



ప్రొద్దుటూరు, అక్టోబర్ 5, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేరు ఉచ్చరించి విమర్శించే ధైర్యం లేని ప్రవీణ్ రాచమల్లుపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైసిపి పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓ మీడియా సమావేశంలో ప్రవీణ్ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రొద్దుటూరు పోలీసులపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల పై విమర్శలు చేస్తూ కనీసం ఎమ్మెల్యే పేరు కూడా చెప్పకుండా పోలీసులు దసరా ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడారని ప్రశంసించారని, దసరా ఉత్సవాలను విజయవంతంగా పోలీసులు నిర్వహించడం ఆనందకరమేనని, కానీ గత 135 సంవత్సరాల పాటు ఉత్సవాలు ఘనంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండానే పోలీసులు చర్యలు తీసుకున్నారని వివరించారు. ఆయన గత 10 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్నా ఏనాడు పోలీసులను ప్రశంసించని ప్రవీణ్ ప్రస్తుతం కేవలం తన అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల మద్దతు కోసమే వారిని సమర్థించారని విమర్శించారు. కనీసం ఎమ్మెల్యే పేరు కూడాచెప్పకుండా విమర్శలు చేసిన ప్రవీణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునే విమర్శించే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని విమర్శించే నైతికత లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు మన్నె సత్యం, బీసీ సెల్ వైసిపి మండల ఉపాధ్యక్షులు నల్లదేసి జంగమయ్య యాదవ్ పాల్గొన్నారు.

## సండే సైకిల్ కార్యక్రమంలో సిఐ



ముద్దనూరు. అక్టోబర్ 05 ప్రభాతవార్త:

కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం ఆదివారం నాడు సిఐ దస్తగిరి నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా, వ్యాయమాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి ఒక్కరూ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని సైకిల్ తొక్కడం అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 5, ప్రభాతవార్త:

గార్మీ పండగ సందర్భంగా స్థానిక మట్టి మసీదు వీధి నందు దుస్తుమియా అండ్ సన్స్ షేక్ ఖాదర్ వలీ 25వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి అంజుమన్ కమిటీ అధ్యక్షులు వి.ఎస్.ముక్తియార్ చేతుల మీదుగా మత పెద్దల సమక్షంలో ప్రార్థనలు చేసి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ముక్తియార్ మాట్లాడుతూ దివ్యాంగులలో చాలా మంది పేదవారు ఉన్నారు. అలాంటి వారికి దస్తగిరి స్వామి గార్మీ పండగ సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందకరమైన విషయమని కొనియాడారు. ఆల్ ఆఫ్ అఫ్జల్ డేటా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గార్మీ పండగ సందర్భంగా దివ్యాంగులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న షేక్ ఖాదర్ వలీ ఎల్లప్పుడు సమాజ సేవా కార్యక్రమాలలో ముందుంటారన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు దేవుని ఆశీస్సులు, చల్లని దీవెనలు ఉండాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, సావిత్రి, యథార్థుడు, కొండమ్మ పాల్గొన్నారు.

## మాజీ సైనికులు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలి

కడప కార్పొరేషన్ అక్టోబర్ 5 ప్రభాతవార్త:




ఉమ్మడి కడప జిల్లాలో ఇళ్ల స్థలాలు లేని మాజీ సైనికులు, వీరనారీమణులు, మాజీ పారామీలటరీ జవాన్లు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ది జై జవాన్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్, చైర్మన్ వి.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప జేఎంఏసిహెచ్‌బిఎస్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర విడిపోకముందు కొన్ని మాజీ సైనిక సంఘాలు ఇళ్ల స్థలాల పేరుతో సంఘాలు ఏర్పాటు చేసుకుని దరఖాస్తు ఫీజుతో మాజీ సైనికుల నుంచి అధిక మొత్తం వసూలు చేశారన్నారు. ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందలేక పోయారు. ఇక మాజీ సైనికులు మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి అక్టోబర్ 27 2008 జీవో ఎంఎస్ నెంబర్ 1241 విడుదల చేసి మాజీ సైనికులకు 175 గజాలు ఇళ్ల స్థల కోసం అవకాశం కల్పించిందన్నారు. ది జై జవాన్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థాపించామని వెల్లడించారు. 11 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉండే మాజీ సైనికులు, వీరనారీమణులకు ఇళ్ల స్థలాల కోసం సొసైటీ బైలా ప్రకారం రూ. 500 చెల్లించి సభ్యత్వం తీసుకోనీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. డిష్ ఛార్జ్ బుక్కు, ఐడి కార్డు, ఆధార్ కార్డు నాలుగు జిరాక్స్ కాపీలతో కడప ఆర్టీసీ బస్టాండ్ దగ్గరల్లో సింహపురి కాలనీ, డోర్ నెంబర్ 42/347/ 82 మేడ పైన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8341699018, 9849282079 సంప్రదించండి. కార్యక్రమంలో డైరెక్టర్ లు బి.వి.రమణ, భాను ప్రతాప్ జాయింట్ సెక్రటరీ పి.ధనంజయ, వెంకటేశ్వరరావు,నాగేంద్ర రెడ్డి,ఎం. కిషోర్ రెడ్డి, పి.రాఘవాచారి పాల్గొన్నారు.

## జమ్మలమడుగు డిపో మేనేజరుగా సుబ్బమ్మ

జమ్మలమడుగు, అక్టోబరు 5, ప్రభాతవార్త:

ఏపీఎస్ ఆర్టీసీ జమ్మలమడుగు డిపో మేనేజరుగా కె.సుబ్బమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సుబ్బమ్మ మాట్లాడుతూ సీఎం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకానికి బస్సులను జాగ్రత్తగా పరిశీలించాలని బస్సులకు ఏవైనా సమస్యలుంటే తమను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశానికి నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ గ్యారేజీ కమిటీ తరుపున డిపో మేనేజర్ సుబ్బమ్మకు చిరు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజీ ప్రెసిడెంట్ బ్రహ్మయ్య, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రుడు, గ్యారేజీ కార్యదర్శి కార్యదర్శి ఎస్.ఎం.వలీ మరియు గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది : ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు అక్టోబర్ 5 ప్రభాతవార్త:

ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైనదని విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (క్రుష్మా) ఆధ్వర్యంలో దొరసాని పల్లెలో వున్న గోపికృష్ణ సెంట్రల్ స్కూల్ నందు ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లను, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ పిల్లలకు చదువుతో పాటు మంచి క్రమ శిక్షణతో కూడిన విలువలు నేర్పించాలని వివరించారు. ఈ కార్యక్రమానికి పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విశిష్ట అతిధిగా హాజరయ్యారు. విద్యారంగ అభివృద్ధిలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా సమాన పాత్ర పోషిస్తున్నాయని, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయడం చాలా మంచి కార్యక్రమన్నారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రానున్నాయని, సిలబస్ మారనుందని, రాయలసీమ ప్రాంతంలోని చరిత్రలో నిలిచిపోయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి వారి చరిత్రను కూడా పాఠ్యాంశాలలో చేర్చనున్నారని వివరించారు. ప్రవేట్ ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వటం ఆనందకరమని తెలిపారు. ప్రవేట్ పాఠశాలలు ఏర్పాటు చేయడం వలన పలువురికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. అనంతరం ఉమ్మడి కడప జిల్లా నలుమూలల నుండి వచ్చిన 150 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి జి. రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, సంఘం వ్యవస్థాపకులు ఎన్. సోమశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బి.ఎస్. రమణారెడ్డి, కార్యదర్శి బి. బాలసుబ్బారెడ్డి, కోశాధికారి ఏ. ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు ఎం. అశోక్ రెడ్డి, జి. మాధవరెడ్డి, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు బి. రాజారావు, గోపి కృష్ణ స్కూల్ డైరెక్టర్ కే. ప్రదీప్ రెడ్డి, పట్టణ కార్యదర్శి వి. శివ శంకర్ రెడ్డి, కోశాధికారి డి. మనోహర్ రెడ్డి గౌతమ్ స్కూల్ అధినేత సుధీర్ నాయుడు మరియు జిల్లా నలుమూలల నుండి వచ్చిన కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం



బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 05 ప్రభాతవార్త

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి గుడి చుట్టూ ఊరేగింపుగా రథోత్సవంను దేవాదాయ శాఖ కమిషనర్ రామ చంద్రమోహన్ ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్నారు. ఆదివారం ఉభయ దాతలైనా పెద్ద ముడియం వాస్తవ్యులు సాంబవరం జగదీశ్వర్ రెడ్డి వారి ధర్మపత్ని సురేఖ,మరియు భక్తుల మధ్య,రథోత్సవంను నిర్వహించాము, ఈ అవకాశాన్ని భక్తులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని వారన్నారు. ఈ కార్యక్రమం లో ప్రసాద్ పూజారి, పూజారి మిథున్,సిబ్బంది నాగలింగా చారి, శ్రీనివాసులు,చిన్న సుబ్బారాయుడు,భక్తులు తది తరులు పాల్గొన్ని రథోత్సవంను జయపదం చేశారు.

## క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం..



సుండుపల్లి, అక్టోబర్ 05, ప్రభాతవార్త :

మండల పరిధిలో బాగంపల్లి గ్రామ పంచాయతి దీన్నేమీద బలిజపల్లి కి చెందిన బొనంశెట్టి నాగరాజ కుమారుడు నాగ చైతన్య క్యాన్సర్ వ్యాధి తో వేలూరు సీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసినదే. నాగ చైతన్య వైద్య చికిత్స కోసం గల్ఫ్ సేన జనసేన కమిటీ సభ్యులు కాంచన శ్రీకాంత్, బాణవతి రామచంద్ర నాయక్, పగడాల అంజన్ కుమార్, ఆకుల రాజేష్, పిరదా సూర్యనారాయణ,జగిలి ఓబులేసు రెడ్డిచెర్ల ఆంజనేయులు,జగిలి ఆంజనేయులు, చెన్నంశెట్టి రాంబాబు లు కలిసి 71,250.00 రూపాయలు నాగచైతన్య అమ్మమ్మ సుబ్బలక్ష్మముకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్, జగిలి ఓబులేసు, ఒంటేరు రాజ గోపాల్, షేక్ మున్నా,నాగ నితిన్, వినయ్ పాల్గొన్నారు.

## ఘనంగా గార్మి పండగ

బద్వేల్ అర్బన్, అక్టోబర్ 5, ప్రభాతవార్త

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సుమిత్ర నగర్‌లో ఆదివారం అమీర్ షారుక్ మసీదు దగ్గర గర్మీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 2000 మంది హిందూ, ముస్లిం సోదరులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . హిందూ ముస్లింల ఐక్యతను చాటేలా ఈ పండుగను ప్రజలందరూ సుఖ సంతోషాల మధ్య జరుపుకున్నారు. మన రాయలసీమ ప్రాంతముల దస్తీగిరి స్వామి పండుగ హిందు, ముస్లీం సొదరులు కలిసి ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. గత 20 సంవత్సరాల నుంచి ఈ పండుగను సుమిత్ర నగర్ లో ఈ పండుగను జరుపుకోవడం దాతల సహకారంతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందనీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఏ షరీఫ్, నాయబ్, నాయ క్, జోషాక్, దావూద్, జీలాని, నాసీర్, చాన్ బాషా, అరబ్, హుమియిన్ తదితరులు పాల్గొన్నారు.

## కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



బద్వేల్ అర్బన్ అక్టోబర్ 05 ప్రభాతవార్త :

బద్వేల్ పట్టణానికి విచ్చేసిన కర్నూల్ కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీ వాసవి సత్ర సముదాయాల జనరల్ సెక్రటరీ శ్రీ కాశి అన్నపూర్ణ సత్రం ఆర్బిటేటర్ లక్ష్మయ్యలకు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్, రాచపూడి నాగభూషణం కళాశాల ఏవో రాచపూడి సాయికృష్ణ, శ్రీ కాశీ అన్నపూర్ణ సత్రం సెక్రటరీ మునగా పద్మనాభయ్య వారికి ఘనస్వాగతం పలికి శాలవా పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ స్టార్ హెల్త్ అడ్వైజర్ బచ్చు సురేష్ బాబు, బైసాని కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మునిగోపాలక్రిష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు



మదనపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త :

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గుంటూరులో శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచి సీనియర్ సిజిటన్స్‌కు రాష్ట్రస్థాయి అవార్డులు ప్రధానంచేశారు. ఈ అవార్డుల ప్రధానంలో బాగంగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మునిగోపాలక్రిష్ణకు రాష్ట్రస్థాయి అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గల్లా మాధవి, రాష్ట్ర డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి, జిల్లాకలెక్టర్ తమసీనమ్ అన్నారియాల చేతుల మీదుగా ఈ అవార్డును ప్రధానం చేశారు. అనంతరం మునిగోపాలక్రిష్ణకు శాలువ కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అవార్డు గ్రహితను గొల్లపూడి తిరుపతిరావు, టిఎఎస్ క్రిష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్, ఎన్‌వినాయుడు, మహిళా ప్రతినిధి సరస్వతమ్మ, మునిరత్నమయ్య, శ్రీనివాసులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్మా...దుర్గమ్మ కాపాడమ్మ..అంటూ పూజలు

దొడ్డిపల్లెలో ఘనంగా ఆయుదపూజలు



పూజల్లో పాల్గొన్న దృశ్యం

రామసముద్రం,, అక్టోబర్ 5 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని దొడ్డిపల్లె గ్రామంలో దుర్గామాతకు ఆదివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. దొడ్డిపల్లి ఆనంద్ కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో దర్గామాతను ప్రత్యేకంగా కొలిచారు. అమ్మా దుర్గమ్మ మమ్మలను కాపాడుతల్లి అంటూ పూజలు నిర్వహించారు. వీరికి సంబంధించిన పనిముట్లు అక్కడ పెట్టి ఆయుద పూజ నిర్వహించారు. పూజారి అనీల్‌స్వామి వేదమంత్రాలతో పూజలు నిర్వమించారు. ఈ కార్యక్రమంలనో వాల్మీకిజిల్లా నాయకులు దొడ్డిపల్లి ఆనంద, చంద్రకళ, రంజిత్, హర్ష, దీక్షలను ప్రత్యేకంగా పూజాలి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో తీర్థప్రసాదాలు, అల్పాహారం నిర్వహించారు.

# మదనపల్లెను జిల్లా చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసి నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

మదనపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త :

మదనపల్లెను జిల్లా చేయాలని జేఏసి నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఏర్పాటులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్రజల మనోభావాలకు పాతర వేస్తోందని, ఇచ్చిన హామీపై చేతులు ఎత్తేసినట్లు పేర్కొన్నారు. మదనపల్లె జిల్లా జేఏసి మలిదశ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఈనెల 26న మదనపల్లెలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జిల్లాకోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసెంబ్లీలో డిమాండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని జిల్లా ఏర్పాటు ఎప్పడని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జిల్లా సాధన కోసం 632 రోజులు వివిధ రకాల పోరాటాలు చేసిన విషయం గుర్తు చేశారు. అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు ఉద్యమాల్లో పాల్గొని మేము అధికారంలోకి వస్తే జిల్లాగా ప్రకటిస్తామని ఇచ్చిన మాటను గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వం మదనపల్లె జిల్లా సాధన ఉద్యమకారులపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఆ కేసులను కూటమి ప్రభుత్వం తొలగించాలని మదనపల్లె జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్ళపల్లె నియోజకవర్గాలను కలిపి వెంటనే జిల్లా ప్రకటించాలని కోరారు. మదనపల్లె జిల్లా సాధనే లక్ష్యంగా నాలుగు నియోజకవర్గాల్లో పెద్దఎత్తున మళిదశ ఉద్యమ కార్యాచరణపై రౌండ్‌టేబుల్‌సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాలమహానాడు అధ్యక్షులు యమలాసుదర్శనం, బోడెం రాజశేఖర్‌యాదవ్; సిపిఐ మురళి, సిపిఎం ప్రభాకర్‌రెడ్డి, విసికె సభ్యులు పీరూ, డాక్టర్ ఎస్‌కె.బాషా, గుండాల మనోహర్, మల్లెల మోహన్, రామాంజులు, శరత్‌కుమార్‌రెడ్డి, రవీంద్ర, పాలేటి మహబూబ్‌బాషా, భానుప్రకాష్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతదినోత్సవ వేడుకలు



పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:

పట్టణంలోని మలకతవ ఆంజనేయ స్వామి గుడిలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభించి విజయవంతంగా నూరు సంవత్సరాలు జరుపుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం శత జయంతి వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా సంస్థ వ్యవస్థాపకులు కేశవరావు బలి రామ్ హెడ్గేవార్, గురూజీ, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం ఆర్ఎస్ఎస్ గత 100 సంవత్సరాలుగా పనిచేస్తూ భారత దేశానికి ఒక రక్షణ కవచంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నిబద్ధత కలిగిన వారై వ్యక్తి నిర్మాణం తద్వారా భారత దేశ నిర్మాణం చేయడంలో అనుశాసనంతో ఎటువంటి ఆడంబరాలకు వెళ్లకుండా నిరంతరం సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ ఆపత్కాలంలో దేశాన్ని ఆదుకోవడంలో ఎల్లవేళలా ముందు నిలిచారని కొనియాడారు . 1948,1962 ,1965 చైనా, పాకిస్తాన్ యుద్ధ సమయంలో భారత సైనికులకు అనేక సేవలందించి దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన వారు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలన్నారు. అప్పటి ప్రధాని నెహ్రూ ఆర్ఎస్ఎస్ నిబద్ధతను సేవలను గుర్తించి 1963 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పెరేడ్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు స్థానం కల్పించడం అనేది దేశంలో మరో చరిత్ర కు తార్కాణం అనిచెప్పవచ్చు. అనేక సందర్భాల్లో ఆర్ఎస్ఎస్ ను అప్పటి కేంద్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ మొక్కవోని ధైర్యంతో కార్యకర్తలు దేశం కోసం పనిచేసి దేశానికి ఈ ధర్మానికి ఒక రక్షణ కవచంగా నిలిచారని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో జగద్గురు స్థానంలో నిలబెట్టడమే ఆర్ఎస్ఎస్ కార్యకర్తల లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరైనటువంటి గ్రామ పెద్దలు మరియు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పోరుమామిళ్ల పట్టణంలోని ప్రధాన వీధి మరియు ఉప వీధులగుండా శతజయంతి వేడుకల సందర్భంగా విజయోత్సవ బైక్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు.

## స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేత





పూడ్చిన అనంతరం

సిద్ధవటం అక్టోబర్ 5 ప్రభాతవార్త

సిద్ధవటం మండలందెబ్బతిన్న రహదారిని స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేశారు. మండలంలోని కడప మాచుపల్లి రహదారి,టక్కోలి జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపాన ఆర్అండ్‌బి రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాన్ని స్వచ్ఛందంగా మరమ్మత్తులు చేశామని టిడిపి నేత మాజీ మార్కెట్ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కొంత రహదారి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతల మయం కావడంతో అటు విద్యార్థులకు ప్రయాణికులకు వాహనాలకు ఇబ్బందికరంగా ఏర్పడడంతో స్వచ్ఛందంగా గ్రావిల్ తరలింపు చేపట్టి జెసిబి యంత్రంతో పనులు పూర్తి చేశామని తెలిపారు గత నాలుగేళ్లగా రహదారి పనులు చేపట్టకపోవడంతో ప్రజా సమస్యలపై స్వచ్ఛందంగా పనులు చేపట్టామని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మల్లు విజయభాస్కర్ రెడ్డి, సింగల్ విండో మాజీ డైరెక్టర్ బాలిరెడ్డి, శేఖర్ రెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి మండల స్థాయి క్రీడల పోటీలు

రాజుపాలెం, అక్టోబర్ 05, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు రేపటి నుండి క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు డిఇఓ, ఎంఈఓ, ఎస్జిఎఫ్ సెక్రటరీల ఆదేశానుసారం 2025-26 విద్య సంవత్సరంకు సంబంధించి సిజిఎఫ్ అండర్ 14 మరియు 17 బాల బాలికలకు మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు రాజుపాలెం ప్రధానోపాధ్యాయులు తెలిపారు. 7వ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్మెంటన్, 8వ తేదీ అథ్లెటిక్స్, యోగా, చెస్ క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు 6వ తేదీ సాయంత్రంలోపు రాజుపాలెం వ్యాయామ ఉపాధ్యాయుడు లేక మండల కోఆర్డినేటర్లు వద్ద ప్రవేశం కొరకు పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ క్రీడా పోటీలలో ఆసక్తి ఉన్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని తమ సత్తాను చాటి మండల స్థాయి నుంచి డివిజనల్ స్థాయికి అక్కడి నుండి జిల్లా రాష్ట్రస్థాయిలకు పోటీపడి మన గ్రామ, మండలంనకు పేరు తీసుకు రావడంతో పాటు క్రీడలలో తమ సత్తా చాటాలని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు అధ్యాపకులు కోరారు.

## కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:

కార్యకర్తలకు అండగా నిలిచేందుకే వైసీపీ అధిష్ఠానం డిజిటల్ బుక్కును ఏర్పాటు చేసిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాసినాయన మండలం వరికుంట్లలో ఆయన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరించారు. దీన్ని ఏ విధంగా ఉపయోగించాలి అనే విషయాలను కార్యకర్తలకు వివరించారు. ఇబ్బందులకు గురై ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎవరి ద్వారా అయితే ఇబ్బందులు పడతాము వారి వివరాలను నమోదు చేస్తే వీటిని కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి వెళ్తాయన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ డిజిటల్ బుక్ లో నమోదైన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా వైసీపీ కార్యకర్త భయపడే పరిస్థితిలో లేరన్నారు. ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని తాము పార్టీ ద్వారా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి ఆదిత్య రెడ్డి, నియోజకవర్గం బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు హనుమంతు రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు క్లాస్ వన్ కాంట్రాక్టర్ పంగా గురివిరెడ్డి, సర్పంచులుపెద్ద రామయ్య, వెంకట్రామిరెడ్డి, పిచ్చిరెడ్డి,జిల్లా అనుబంధం విభాగాల నాయకులు నాగ సుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు గంటా రమణారెడ్డి, ఓబుల్ రెడ్డి, పెద్ద సత్యనారాయణ రెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీరాములు, దుగ్గి రెడ్డి, రవిచంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, రామలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

## ముదివేడు పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

కురబలకోట, అక్టోబర్ 5 ప్రభాతవార్త :



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

కురబలకోట మండలం ముదివేడు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఎస్‌పి దీరజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి పలు సూచనలు జారీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, సీడీఫైళ్ళు, ఎంట్రీలు సమయానుకూలంగా అప్‌డేట్‌చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలు త్వరతగతిన పరిష్కరించాలని, స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచినందుకు సిబ్బందిని అభినందించారు. స్టేషన్‌కు సంబంధించిన భూమిని సర్వే చేయించి చుట్టూ కంచెను వేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచి విజిబుల్ పోలీసింగ్ ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదు అవుతున్నందున డ్రంగ్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా వాహానాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగళ్ళు చుట్టుపక్కల సిసి కెమరాలు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్‌పి వెంట ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లైసెన్సు లేని వాహనదారులకు జరిమానా, కౌన్సిలింగ్

కలసపాడు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:

మండల పరిధిలో ఎస్సై తిమోతి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఎలిమెంట్ లేని వారికి, ఆర్సి లేని వారికి జరిమానా విధిస్తూ వారికి కౌన్సిలింగ్ ఎస్సై ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులుగా భాస్కరన్



మదనపల్లె క్రైమ్ అక్టోబర్ 5 ప్రభాతవార్త.

ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ ఫోరం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా భాస్కరన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎం భాస్కరన్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా పి ఎల్ ఎన్ శాస్త్రి, గౌరవాధ్యక్షులుగా వెంకట శివయ్య, డివిజన్ కార్యదర్శులుగా హేమంత్ కుమార్, అశోక్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రెడ్డి శేఖర్ రెడ్డి, ఈ రామయ్యలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కార్యదర్శులుగా మురళీధర్, శ్రీధర్ కుమార్, మహిళా కార్యదర్శిగా జి పార్వతి ఉపాధ్యక్షులు ఏ జగన్మోహన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎన్ రాజయ్య, కె భాస్కర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భాస్కరన్ మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ వారు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## వేధింపులే లక్ష్యం... అభివృద్ధి శూన్యం

పీలేరు అక్టోబర్ 5 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం వైఎస్సార్సీపీ నేతలను వేధింపులే లక్ష్యంగా పని చేస్తోంది తప్ప అభివృద్ధి గూర్చి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎల్లెలవారి పల్లెలో అనారోగ్యంతో ఉన్న జయరామిరెడ్డిని పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు గుర్తుకొచ్చేలా ఒక్క పథకం కూడా ఇప్పటి వరకు లేదని విమర్శించారు. ఆయన రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రలు, వెన్నుపోటుతోనే గడిపేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రధానంగా వైఎస్సార్సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, అణచివేయడం భూఆక్రమణలు చేయడానికే సమయం సరిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పీలేరుకు ఏడు స్వచ్ఛాంధ్ర ఆవార్డులు

పీలేరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర 2025కు సంబంధించి పీలేరు నియోజకవర్గంలో ఏడు స్వచ్ఛాంధ్ర ఆవార్డులు వచ్చినట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర 2025 జిల్లా స్థాయి అవార్డుల్లో పీలేరు నియోజకవర్గం ఏడు అవార్డులు గెలుచుకుందని తెలిపారు. ఇందులో పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏరియా ఆస్పత్రి. కామాటంవారిపల్లె అంగన్వాడీ కేంద్రం, కేవీపల్లెలో గ్యారంపల్లె ఆయూష్ ఆస్పత్రి, పీలేరు మండలం ముదుపులవేముల గ్రామ సమాఖ్య. వాల్మీకిపురం అయ్యావారిపల్లె గ్రామ మహిళా సమాఖ్య, గుర్రంకొండ గ్రామ పంచాయతీ ఎంపికైనట్లు వివరించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆవార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



స్వచ్ఛాంధ్ర ఆవార్డుకు ఎంపికైన పీలేరు ఏరియా ఆస్పత్రి

## గొల్లపల్లెలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం అక్టోబర్ 05, ప్రభాతవార్త



మండలం లోని రేకలకుంట పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు మరియు టిడిపి మండల యువనాయకులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నూతన విద్యుత్ లైన్ల పనులను ప్రారంభించడం జరిగింది.ఎన్నో ఏళ్లుగా తమ గ్రామంలో విద్యుత్ సమస్యను పట్టించుకున్న నాయకులే లేరని, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు ఓబయ్య,లక్ష్మీనారాయణ,కొండయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

కడప జిల్లా: బద్వేలు రూరల్, పోరుమామిళ్ల, కొండాపురం, లింగాల, సికెదిన్నె, అట్లూరు

అన్నమయ్య జిల్లా: బి.కొత్తకోట, వీరబల్లి, పిటిఎం, కలకడ, వాయల్పాడు, రైల్వేకోడూరు, పుల్లంపేట, నందలూరు

ఇంటర్వ్యూ తేది : 11.10.2025

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086